కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న కుమార్‌గౌడ్

కలెక్టర్‌ను కలిసిన టోల్‌ప్లాజా యూనియన్ బాధ్యులు

రఘునాథపల్లి, నవంబర్ 12: టోల్‌ప్లాజా యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎర్రోళ్ల కుమార్‌గౌడ్ నేతృత్వంలోని కార్యవర్గం సోమవారం జిల్లా కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. అనంతరం కుమార్‌గౌడ్ మాట్లాడుతూ టోల్ ప్లాజా నుంచి వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా టోల్‌ప్లాజా యూనియన్ సభ్యులు శ్రద్ధ తీసుకుంటున్నారని, దీనికి ఉన్నతాధికారులు సహకారం అందించాలని కోరారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారని కుమార్‌గౌడ్ తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అధ్యక్షులు మహ్మద్ సమీర్‌ఆలీ, ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి పృథ్వీరాజ్, ప్రధాన కార్యదర్శి గడ్డం కరుణాకర్, సహాయ కార్యదర్శి బండి శ్రవణ్, సభ్యులు ఆకునూరి రాజు, శాతరబోయిన నగేశ్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు దేవరుప్పలలో ఇసుక వేలం

దేవరుప్పుల, నవంబర్ 12: తహసిల్ ఆఫీస్‌లో నిల్వ చేసిన ఇసుకకు ఈ నెల 13న ఉదయం 11 గంటలకు వేలం వేస్తున్నట్లు తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా వివిధ గ్రామాల నుంచి నాలుగు ట్రాక్టర్ల ద్వారా తరలించిన ఇసుకను ఇటీవల పోలీసులు సీజ్ చేశారు. దీనిని తహసిల్ ఆఫీస్‌లో నిల్వ చేసినందున వేలం వేస్తున్నట్లు తెలిపారు. అత్యధిక ధర పాడిన వారికి ఇసుక ఇస్తామని, ఆసక్తిగల వారు హాజరుకావాలని ఆయన కోరారు.

రోడ్డుపై పిచ్చి మొక్కలను తొలగిస్తున్న సీఐ అబ్బయ్య

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

తరిగొప్పుల, నవంబర్ 12 : రోడ్డు ప్రమాదాల నివారణకు తమవంతు కృషి చేస్తున్నామని, ఇందులో భాగంగా రహదారులపై మూలమలుపుల వద్ద ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి, చెట్ల కొమ్మలను నరికేయాలని సీఐ అబ్బయ్య సూచించారు. జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ ఆదేశాల మేరకు మంగళవారం రోడ్లపై ప్రమాదాల నివారణ కోసం ముందస్తుగా పిచ్చి మొక్కలను, ముళ్ల కంపలను తొలగించాలన్నారు. తరిగొప్పుల నుంచి హుస్నాబాద్, బొంతగట్టునాగారం నుంచి బొత్తలపర్రెకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించాలన్నారు. కార్యక్రమంలో పీఎస్సై రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

జనగామను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి

జనగామ చౌరస్తా, నవంబర్ 12 : జనగామ జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ అన్నారు. సోమవారం రాత్రి జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్కు వద్ద జరిగిన ఆ పార్టీ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా అబ్బాస్ హాజరై మాట్లాడారు. జిల్లా ఆవిర్భవించి తొమ్మిది సంవత్సరాలవుతున్నదని తెలిపారు. చదువుకున్న నిరుద్యోగ యువకులకు స్థానికంగా ఉపాధి లేకపోవడంతో ప్రతిరోజు రైలు మార్గం ద్వారా హైదరాబాద్‌కు పనుల కోసం వెళ్తున్నారని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని అబ్బాస్ విమర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు పెంచకపోవడంతో రైతులు పడిగాపులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్, నాయకులు ఇర్రి అహల్య, రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, బూడిద గోపి, సుంచు విజేందర్, దస్తగిరి, లింగం, కల్యాణి, బీరయ్య, బాల్నె వెంకటమల్లయ్య, లలిత, శ్రావణ్, చందు, శ్రీకాంత్, బాలమణి, మల్లేశ్, అంజమ్మ, రజిత, అనిత, రజిత పాల్గొన్నారు.

నూతన కమిటీ బాధ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న శ్రీనివాస్

టీపీటీఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

జనగామ చౌరస్తా, నవంబర్ 12 : తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) జిల్లా నూతన కమిటీని మంగళవారం స్థానిక ఉమాపతి భవన్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ ఎన్ రాజు, ప్రధాన కార్యదర్శి ఎండీ అంకుశావళి, ఉపాధ్యక్షులుగా ఇమ్మడి అశోక్, వజ్రయ్య, శారద, యాద శ్రీనివాస్, రాజారెడ్డి, సత్యనారాయణరెడ్డి, కార్యదర్శులుగా శ్రీహరి, శ్రీరామ్, కవిత, లక్ష్మణజీ, వెంకన్న, శ్రీనివాస్, వెంకన్న, స్టేట్ కౌన్సిలర్‌గా కుర్రెముల యాదగిరి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా శేషగిరిరావు, అకాడమిక్ సెల్ కన్వీనర్‌గా రాజేందర్, జీవోల కమిటీగా కన్వీనర్ సురేందర్, మీడియా కన్వీనర్‌గా ప్రభాకర్ ఎన్నికయ్యారు. నూతన కమిటీకి ఎన్నికల అధికారిగా టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీ శ్రీనివాస్ వ్యవహరించి, నూతన కమిటీ బాధ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

కుటుంబ సమగ్ర సర్వే ఫారాలను భద్రపర్చాలి

- సర్వేలో ఎన్యుమరేటర్లు తప్పులు లేకుండా నమోదు చేయాలి
- అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

పోచన్నపేటలో సర్వేను పరిశీలిస్తున్న పింకేశ్‌కుమార్

ఓబుల్‌కేశ్వాపూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో

బచ్చన్నపేట/జనగామ రూరల్, నవంబర్ 12 : ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వే ఫారాలను జాగ్రత్తగా భద్ర పర్చాలని, సమాచారం బహిర్గతం కాకుండా చూడాలని అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతోపాటు పోచన్నపేటలో ఇంటింటి సర్వేను పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. అనంతరం పింకేశ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఎన్యుమరేటర్ సర్వే చేసే విధానాన్ని, అడిగే ప్రశ్నల తీరును, సర్వే ఫారమ్‌లో కుటుంబాల వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. జర్నలిస్టు కుటుంబాలను సర్వే చేసేటప్పుడు అదే కాలంలో నింపాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంను పింకేశ్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేకాధికారి రామారావునాయక్, తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఎంపీడీవో మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, హెచ్‌ఎం కృష్ణంరాజు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జనగామ మండలంలోని ఓబుల్ కేశ్వాపూర్, పెద్దరాంచర్ల, ఎల్లంల, పసరమడ్ల గ్రామాల్లో చేపట్టిన సర్వేను ఎంపీడీవో ఉప్పగల్లు సంపత్‌కుమార్ పరిశీలించారు. సర్వేను ఎన్యుమరేటర్లు పారదర్శకంగా చేపట్టాలని కోరారు. ప్రతి ఇంటికివెళ్లి కుటుంబ యజమానితో పాటు సభ్యుల వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేయాలని సూచించారు. సమగ్ర సమాచారంతో సర్వే వివరాలను రికార్డు చేయాలని ఆయన కోరారు.

బచ్చన్నపేటలో మాట్లాడుతున్న రామారావునాయక్

నిడిగొండలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీపీ

గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

జేడీఏ రామారావునాయక్

బచ్చన్నపేట/రఘునాథపల్లి, నవంబర్ 12 : గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి రామారావునాయక్ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో, ఏపీఎం, సీసీ, వీవోఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రామారావునాయక్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లోకి వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు పంపించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్వాహకులు నిస్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఎంపీడీవో మల్లికార్జున్, ఏపీఎం కొత్తపల్లి నాగేశ్వర్‌రావు, మండల వ్యవసాయాధికారి విద్యాకర్‌రెడ్డి, సీసీలు విజయలక్ష్మి, నర్సింహులు, సత్యనారాయణ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రఘునాథపల్లి మండలం నిడిగొండలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ పరిశీలించారు. ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి తేమ శాతం, తూకం వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. డీసీపీ మాట్లాడుతూ దళారులను అశ్రయించి రైతులు మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ, స్థానిక ఎస్సై దూదిమెట్ల నరేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత

జనగామ చౌరస్తా, నవంబర్ 12 : జనగామ పట్టణ పరిధిలో ఇటీవల సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ముగ్గురు బాధితులకు మంగళవారం అర్బన్ పీఎస్‌లో రికవరి చేసిన ఫోన్లు అందజేసినట్లు సీఐ పీ దామోదర్‌రెడ్డి తెలిపారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా బాధితుల సెల్‌ఫోన్లను గుర్తించి తిరిగి అప్పగిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. సెల్‌ఫోన్లు అప్పగించినందుకు పోలీసులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు భరత్, రాజన్‌బాబు పాల్గొన్నారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న జనగామ అర్బన్ సీఐ దామోదర్‌రెడ్డి

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నర్మెట, నవంబర్ 12: మండలంలోని అమ్మాపురంలో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.లక్ష విలువైన చెక్కులను బాధిత కుటుంబసభ్యులకు మంగళవారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ అందించారు. గంగం వీరారెడ్డి, సుంకరి కవిత, పింగిలి రాములమ్మ కుటుంబసభ్యులకు చెక్కులను అందించారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు పండ్ల బాల్నర్సయ్య, మాజీ ఎంపీటీసీ బైరగోని సురేందర్, మాజీ ఉపసర్పంచ్ బైరగోని లక్ష్మయ్య, నాయకులు బర్రె బస్వారెడ్డి, బైరి యాదగిరి, ఇర్రి కృష్ణారెడ్డి, వలాద్రి మధుసూదన్, చెక్కిళ్ల వెంకటేశ్వర్లు, గంగం ప్రభాకర్‌రెడ్డి, బైరగోని కర్ణాకర్, స్వామి, అంజనేయులు, రాజిరెడ్డి పాల్గొన్నారు.

న్యాయం కోసం మృతదేహంతో కుటుంబసభ్యుల ధర్నా

లింగాలఘనపురం, నవంబర్ 12 : మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ హైదరాబాద్-హనుమకొండ హైవేపై నెల్లుట్ల వద్ద మృతురాలి కుటుంబ సభ్యులు మంగళవారం ధర్నా చేశారు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నెల్లుట్ల హైవే వద్ద నెల్లుట్ల వడ్డెర కాలనీకి చెందిన శివరాత్రి రాములమ్మ మృతి చెందింది. కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వడ్డెర కాలనీ వాసులతో పాటు, ఆ కుటుంబ సభ్యులు రహదారిపై రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ ఏసీపీలు పార్థసారథి, భీంశర్మ, ఎస్సై బండి శ్రావణ్‌కుమార్ ఆందోళనకారుల వద్దకొచ్చి మాట్లాడారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

నెల్లుట్ల బైపాస్ వద్ద ధర్నా చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు, స్థానికులు

పేదలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తాం

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం

జఫర్‌గఢ్, నవంబర్ 12 : పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్‌లో లబ్ధదారులకు చెక్కులను పంపిణీ చేశారు. జఫర్‌గఢ్ మండలానికి సంబంధించిన 30 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు రూ.30,3,490 విలువైన చెక్కులను, సీఎంఆర్ఎఫ్‌లో 34 మందికి రూ.10.56 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. శ్రీహరి మాట్లాడుతూ పేద ప్రజలకు అండగా నిలవడమే కాదు, వారి అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శంకరయ్య, ఎంపీడీవో సుమన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ తీగల కరుణాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

కేజీకేఎస్ మండల ఉపాధ్యక్షుడిగా వంగ వేణు

స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 12 : కల్లుగీత కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షుడిగా మండలంలోని శివునిపల్లికి చెందిన వంగ వేణును నియమించారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నే వెంకటమల్లయ్య మంగళవారం తెలిపారు. వేణు మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా కమిటీల ఆదేశాల మేరకు కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ, జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్య, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మృతుడి కుటుంబానికి సాయం

దేవరుప్పుల, నవంబర్ 12: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించిన ఇస్తారి రాజశేఖర్ ఈ నెల 6న అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ఉద్యోగుల పక్షాన రూ.16 వేలు సేకరించి మృతుడి కుటుంబ సభ్యులకు మంగళవారం అందించారు. మండల వైద్యాధికారి పూజ ఆధ్వర్యంలో రాజశేఖర్ చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో పల్లె దవఖాన వైద్యులు మనోజ్‌కుమార్, ఉద్యోగులు రామకృష్ణ, దయామయి, భాను ఉన్నారు.

ఆర్థికసాయం అందిస్తున్న వైద్య ఉద్యోగులు

బతుకమ్మకుంటను పరిశుభ్రంగా ఉంచాలి : సీపీఎం

జనగామ చౌరస్తా, నవంబర్ 12 : జనగామ పట్టణంలోని బతుకమ్మకుంటతో పాటు పక్కనే ఉన్న దుర్గమ్మ గుడి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు పార్టీ కార్యకర్తలు బతుకమ్మకుంట, దుర్గమ్మ గుడి పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం, ఖాళీ మద్యం సీసాలు, బీర్ బాటిల్స్‌ను సేకరించి టాటా ఏస్ వాహనంలో మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ మున్సిపల్ కార్యాలయం ఎదుట చెత్త కుప్పను పోసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కనకారెడ్డి మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి అధికారులు కృషి చేయాలని కోరారు. శానిటేషన్ సిబ్బందిని పెంచి పౌర సేవలందించాలన్నారు. చెత్త కుప్పలు నిల్వ ఉండడంతో ప్రజలు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించుకుంటే ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, సీనియర్ నాయకుడు దస్తగిరి, లింగం, శ్రీకాంత్, కల్యాణి, లలిత, బాలమణి, వెంకటేశ్, మహేందర్, సుధాకర్, వెంకటేశ్, మైబెల్లి పాల్గొన్నారు.

జనగామలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పేదల సమస్యలను పట్టించుకోని పాలకులు

స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 12 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల సమస్యలను పట్టించుకోకుండా మోసపూరిత విధానాలను అవలంబిస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రంగరాయగూడెంలో కుర్ర ఉప్పలయ్య అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో పార్టీ పతాకాన్ని నేలమంచి వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. కనకారెడ్డి మాట్లాడుతూ మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికలలో దేశ ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తూ ప్రజలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పెంచకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నదన్నారు. రైస్‌మిల్లర్ల మాయాజాలాన్ని అరికట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, మండల కార్యదర్శి మునిగెల రమేశ్, జిల్లా కమిటీ సభ్యులు కొడపాక యాకయ్య, మండల కమిటీ సభ్యులు దైద రాములమ్మ, కత్తుల రాజు, మంద మహేందర్, పోలాస్ పరమేశ్, సిద్దుల సుదర్శన్, ఇదునూరి యాకయ్య, మునిగె నరసింహులు, యార మోహన్, కత్తుల రాజు, రాం బాబు, లింగన బోయిన రాజు, దాసరి కొమురయ్య, చట్ల రాజు, దైద కుమార్, యార కొమురెల్లి తదితరులు పాల్గొన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి

రేషన్ బియ్యం రవాణాదారుడి రిమాండ్

నర్మెట, నవంబర్ 12: రేషన్ బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి అక్రమంగా కొనుగోలు చేసి రవాణా చేస్తున్న వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నైనాల నగేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం పుట్టగూడెం గ్రామానికి చెందిన గుగులోత్ రాజు తక్కువ ధరకు రేషన్‌బియ్యాన్ని గ్రామాల్లో కొనుగోలు చేస్తున్నాడు. వీటిని అధిక ధరకు పలు ప్రాంతాలకు తరలిస్తున్నాడు. ఈ నేపథ్యంలో రాజు సోమవారం నాలుగు క్వింటాళ్ల బియ్యంతో మండలంలోని కన్నెబోయినగూడెంలో కనిపించగా అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. కేసు పరిశీలించిన జడ్జి నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆదేశాలిచ్చారని ఎస్సై నైనాల నగేశ్ తెలిపారు. ఎవరైనా అక్రమంగా రేషన్ బియ్యం కొనుగోలు చేసినా, రవాణా చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కలెక్టర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ అధికారులు

15న సోమేశ్వరాలయంలో అఖండజ్యోతి

జనగామ చౌరస్తా, నవంబర్ 12 : కార్తీక పౌర్ణమి సందర్భంగా పాలకుర్తిలోని సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి గుట్టపై ఈ నెల 15న నిర్వహించే అఖండజ్యోతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని కలెక్టర్‌ను దేవస్థాన అధికారులు ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం ఆలయ సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, ఉప ప్రధాన అర్చకుడు డీవీఆర్ శర్మ కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్తీక పౌర్ణమి రోజు దేవస్థానంలో నిర్వహించే అఖండజ్యోతి దర్శనం, గిరి ప్రదక్షిణ, లక్ష దీపోత్సవాలకు హాజరుకావాలని వారు విజ్ఞప్తి చేశారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్, దేవస్థాన జూనియర్ అసిస్టెంట్ ఓంప్రకాశ్ పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

జనగామ చౌరస్తా, నవంబర్ 12 : రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సీ విక్రమ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ధర్మకంచ జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు 'లీగల్ అవేర్‌నెస్' నిర్వహించారు. సమాజంలో వివక్ష, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, ర్యాగింగ్ నిరోదానికి విద్యార్థులను చైతన్యపర్చారు. విక్రమ్ మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకోవాలని కోరారు. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజేంద్ర, పాఠశాల హెచ్‌ఎం టీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాలకుర్తిలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నల్లబ్యాడ్జీలతో రెవెన్యూ ఉద్యోగుల నిరసన

పాలకుర్తి, నవంబర్ 12: కొడంగల్ నియోజకవర్గంలో వికారాబాద్ కలెక్టర్‌పై జరిగిన దాడికి నిరసనగా రెవెన్యూ ఉద్యోగులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. స్థానిక తహసిల్ కార్యాలయం ఎదుట తహసీల్దార్ శ్రీనివాస్, నాయబ్ తహసీల్దార్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు సేవలందిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాకేశ్, శ్రీకాంత్, హసీనా, వెంకటేశ్, యాదగిరి, శ్రీకాంత్, రాణి, దాసు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి : సీఐ

తరిగొప్పుల, నవంబర్ 12 : చదువుతో పాటు చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నర్మెట సీఐ అబ్బయ్య సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికా, శిశు సాధికారిత క్లబ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. పోకిరీల ఆగడాలను అరికట్టేందుకు షీటీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. డయల్ 100 వినియోగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏంఈవో జానకి, ఏఎస్సై రాజయ్య, హెడ్‌కానిస్టేబుల్ బాలాజీ, కానిస్టేబుల్ సురేశ్, ఉపాధ్యాయులు అనిత, యూసూఫ్‌పాషా, పద్మ, అమర్‌నాథ్, శ్రీనివాస్, కవిత, శ్రీ అనిత, సుల్తానా, శ్రీనివాస్, రవి, సుమలత, కుమారస్వామి, గోపగోని సంధ్య, బాబు, సురేందర్, కరాటే మాస్టర్లు రవి, విక్రాంత్, బాబు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

సైబర్ నేరాలపై ఆప్రమత్తంగా ఉండాలి

పాలకుర్తి, నవంబర్ 12: సైబర్ నేరాలపై ప్రజలు ఆప్రమత్తంగా ఉండాలని సీఐ గట్ల మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఎస్సై దూలం పవన్‌కుమార్‌తో కలిసి విద్యార్థినులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవడంతోపాటు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెడితే కేసులు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు తల్లిదండ్రులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఆనంతరం పాలకుర్తి పోలీసుల ఆధ్వర్యంలో మండలంలోని మైలారం నుంచి పాలకుర్తి రహదారిక